క్లుప్తంగా

15న 'మాలల సింహగర్జన' విజయవంతం చేయాలి



మాలల సింహగర్జన' మహాసభ వివరాలు వెల్లడిస్తున్న కాకర రాము

రాయవరం: మండలంలోని రామవరంలో రాష్ట్ర మాలమహానాడు పీవీరావు కార్యవర్గ సభ్యుడు కాకర రాము అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాము మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరులో ఈ నెల 15 ఆదివారం నిర్వహించే 'మాలల సింహగర్జన' మహా సభకు లక్షలాదిగా మాలలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పోలిమాటి సుధాకర్, సత్యనారాయణ, దండంగి పైసాదాసు, కత్తుల అప్పారావు, వినకోటి ప్రకాష్, బత్తుల జాన్, సురేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో శ్రీసత్య సాయి మందిరంలో నేటి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆసియన్ వాస్కులర్ హాస్పిటల్ నేతృత్వంలో ద్రాక్షారామ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ విస్సాప్రగడ కృష్ణమూర్తి తెలిపారు. ఉబ్బి మెలికలు, తిరిగిన నరాలు, స్పైడర్ నరాలు, పాదాల వేళ్లల్లో గాంగ్రిన్, పాదం, కాళ్లల్లో పుండ్లు, నలుపు రావడం, ఉబ్బిన నరాలు, వెరికోస్ వీన్స్ తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాల ప్రజలు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

రాయవరం: కరప మండలం వేములవాడలో దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని అఖిలభారత దివ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవల్లి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మట్టా వీరబాబు దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడడం మహిళా సమాజానికే సిగ్గు చేటన్నారు. ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం అతనిపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడికి నిరసన



ఆర్డీఓ అఖిలకు వినతి పత్రం అందజేసిన జర్నలిస్ట్ సంఘాల నాయకులు

రామచంద్రపురం: సినీనటుడు మోహన్ బాబు జర్నలిస్టులపై చేసిన దాడికి నిరసనగా రామచంద్రపురం పట్టణంలో శుక్రవారం రామచంద్రపురం ప్రెస్‌క్లబ్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి ఆర్డీఓ దేవరకొండ అఖిలకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు నరాల రాధాకృష్ణ, రామచంద్రపురం ప్రెస్‌క్లబ్ ప్రింట్, మీడియా అధ్యక్షుడు కాటే భీమశంకరం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కనికెళ్ల కనకరత్నం, బోడపాటి వరప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు పి.రాము, నూకల బలరాం, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం డివిజన్ నాయకురాలు మేడిశెట్టి దుర్గ తదితరులు మాట్లాడుతూ టీవీ 9 జర్నలిస్ట్ రంజిత్‌పై మోహన్‌బాబు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని, దాడికి పాల్పడిన మోహన్‌బాబును తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ బి.రామకృష్ణను కలిసి మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు గంపల పృథ్వీరాజ్, కుడుపూడి రమేష్, యార్లగడ్డ ప్రసాద్, గుబ్బల రాము, వీరభద్రరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు పరిధిలోని ఆలమూరు, మండపేట మండలాల్లో పోలీసులు జరిపిన దాడుల్లో ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్ జరిగింది. ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం ఆలమూరు మండలంలోని మడికిలో సారా విక్రయిస్తున్న ఉండ్రాసపు శాంతకుమారి, మండపేట మండలం ఏడిదలో సారా విక్రయిస్తున్న యార్లగడ్డ వీరవేణిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముద్దాయిలను శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించారు.

హామీల అమలులో కూటమి విఫలం

- మాయ మాటలు చెప్పి గద్దె నెక్కారు
- అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం అందించాలి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్
- రైతు సమస్యలపై చలో అమలాపురానికి తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



మండపేట అమలాపురానికి పయనమవుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



అమలాపురం తరలి వెళుతున్న కపిలేశ్వరపురం మండల నాయకులు

మండపేట: మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలతో పబ్బం గడుపుకునే కూటమినేతలు తీరా గద్దె నెక్కాక హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నేత తోట త్రిమూర్తులు ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు సమస్యల పరిష్కారానికి ఆ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా మండపేట నుంచి కూడా ఆ పార్టీ శ్రేణులు స్వరం వినిపించాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో శుక్రవారం మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి పార్టీలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున అమలాపురం తరలి వెళ్లారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అమలాపురంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తారు. ఇందుకోసం పట్టణంలో విజయ లక్ష్మి నగర్లోని ఆ పార్టీ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున కార్ల ర్యాలీగా జిల్లా కేంద్రానికి పయనమయ్యారు. పార్టీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు)లతో కలిసి తోట పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకే..

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులను మోసగించిన ప్రభుత్వానికి కనువిప్పు కలిగించడానికి, రైతన్నలకు అండగా నిలిచేందుకే జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఎన్నికలపుడు కూటమి నాయకులు లెక్కలేనన్ని హామీలతో ప్రజలను నమ్మ బలికారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఆర్నెళ్లు పూర్తయినా ఇచ్చిన హామీల ఊసు ఎత్తకపోవడం దారుణమన్నారు. జగన్ హయాంలో తమ ప్రభుత్వం రైతన్నలను అన్నివిధాలా ఆదుకుందని తోట గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం చాలా వరకూ వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలనే పేర్లు మార్చి కొనసాగిస్తోందన్నారు. రైతులకు ఇస్తానన్న రూ.20 వేల ఇన్‌పుట్ సబ్సిడీని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. రబీ పంటకు రైతన్నలు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో ఈ పంటకైనా పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని కోరారు. రైతులకు సబ్సిడీపై యంత్ర సామగ్రి, ఇతర సాగు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోట వెంట తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కపిలేశ్వరపురం: రైతు సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రాల్లో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేసే కార్యక్రమం చేపట్టింది. ఆ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు అమలాపురం కలెక్టరేట్‌కు తరలి వెళ్లారు. తోట వెంట తరలి వెళ్లిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీలు పలివెల మధు, మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, సర్పంచులు వాసా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ విభాగం ఉపాధ్యక్షుడు పసలపూడి శ్రీనివాస్, సోషల్ మీడియా నాయకులు పాలింగి శ్రీనివాస్, సేవాదళ్ నాయకులు పాలింగి కృష్ణ కిశోర్, నాయకులు పుట్టా కృష్ణమూర్తి, కట్టా మురళి, గూటం సత్యనారాయణ, మాతా నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



అమలాపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న నాయకులు

రైతుపోరుకు..

కె.గంగవరం/రామచంద్రపురం రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రం అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రైతుపోరు కార్యక్రమానికి రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం మండలాల నుంచి వందలాది మంది వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్య ప్రకాశ్ నేతృత్వంలో తరలివెళ్లారు. కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పందు గోవిందరాజు, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్‌లు మల్లిమొగ్గల శ్రీధర్, వీరబోయిన సూరిబాబు, యల్లమిల్లి సతీష్‌కుమారి, పంపన వీరవెంకటరమణ, పెమ్మిరెడ్డి దొరబాబు, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, నురుకుర్తి శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణు చొరవతోనే జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్



మాజీ మంత్రి వేణును సత్కరించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

రామచంద్రపురం: నియోజకవర్గ ఎమ్మెల్యేగా మంత్రిగా సేవలందించిన చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాల కృష్ణ కృషి ఫలితంగానే రామచంద్రపురంకు అదనపు జిల్లా సెషన్స్ కోర్టు బెంచ్ తీసుకురాగలిగారని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్, వాడ్రేవు సాయిప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టు ఏర్పాటయిన సందర్భంగా మాజీ మంత్రి వేణు వద్దకు వెళ్లి వారు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా కక్షిదారుల కష్టాలకు నేటితో తెరపడిందన్నారు. రాబోయే యువ న్యాయవాదులకు మంచి అవకాశం లభిస్తుందని వారు అన్నారు.

భూయాజమాన్య హక్కుల పరిరక్షణకు రెవెన్యూ సదస్సులు



కపిలేశ్వరపురం మండలం కాలేరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కపిలేశ్వరపురం: భూ యాజమాన్య హక్కుల పరిరక్షణ కోసం రెవెన్యూ సదస్సులు చేపడుతున్నట్టు తహసీల్దార్ చిన్నారావు అన్నారు. కాలేరులో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ భూ యాజమానులు అందజేసిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, అనుబంధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోలంకలో..

కాజులూరు: గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. మండలంలోని కోలంకలో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చుతగ్గులను సరి చేసుకోవాలన్నారు. మ్యుటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, రీ సర్వే రీజన్స్, ఇతర సమస్యలపైన రైతులు ఫిర్యాదు చేసినట్లయితే రెవిన్యూ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేగేశ్వరరావు, స్థానిక నాయకుడు బొండా వెంకన్న పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు నేడు ఎన్నికలు

మండపేట: మండలంలో సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తేజేశ్వరరావు తెలిపారు. మండలం, మండపేట పట్టణ పరిధిలో నాలుగు ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. గ్రామాలవారీగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. మండపేట పట్టణానికి ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, ఏడిద నీటి సంఘానికి ఏడిద జిల్లా పరిషత్ హైస్కూల్లోను, పాలతోడు సంఘానికి వెలగతోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను, కేశవరం నీటి సంఘానికి కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వివరించారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రైతులు సహకరించాలి

కాజులూరు: మండల గ్రామాల్లో శనివారం జరుగనున్న నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రైతులు సహకరించాలని మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. తహసీల్దార్ ఎల్.శివకుమార్ మండల గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. శలపాకలో ఆయన మాట్లాడుతూ మండలంలో శలపాక, గొల్లపాలెం, పెనుమళ్ళ, కాజులూరు, మంజేరు, దగ్గుదుర్రు, కోలంక, పల్లిపాలెం సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఎన్నిక పక్రియ ప్రారంభమౌతుందని ఓటుహక్కు కలిగిన రైతులు ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల్లోపు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు హాజరు కావాలన్నారు. గడువు దాటిన తర్వాత వచ్చిన ఓటర్లను అనుమతించబడదన్నారు. ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వోలు గనికమ్మ, పట్టాభి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



శలపాకలో నీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివకుమార్

ద్రాక్షారామ భీమేశ్వరునికి నేడు జన్మనక్షత్ర పూజలు

- మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం



విశేష అలంకరణలో భీమేశ్వరస్వామి (ఫైల్)

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి జన్మనక్షత్రం రోహిణీ పురస్కరించుకుని నేడు స్వామివారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, మేలుకొలుపు, 5 గంటలకు తీర్థపు బిందె, ప్రాతఃకాలార్చన, 5.30 గంటలకు లక్షపత్రి పూజ, లక్షకుంకుమ పూజ, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో సంకల్పం, గణపతి పూజ, మహన్యాసం, ఏకాదశ రుద్రాభిషేకం, 9 గంటలకు నంది వాహనంపై స్వామివారి నగరోత్సవం, 12 గంటలకు మహానివేదన, రాత్రి 7.30 గంటలకు సోమవార మండపంలో స్వామి ప్రదోష కాలార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 9.30 గంటలకు నీరాజన మంత్ర పుష్పాలు, కవాట బంధనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు స్వామి వారి జన్మనక్షత్ర పూజల్లో పాల్గొని తరించాలని కోరారు.



మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో కుంభాభిషేకం, హోమాలకు ఏర్పాట్లు

మాసశివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో..

స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా మాసశివరాత్రి కమిటీ వ్యవస్థాపకుడు, రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఏకకాలంలో 1008 శివ లింగాలకు భక్తులు స్వహస్తాలతో అభిషేకాలు చేసుకునే అవకాశం ఉంటుంది. అభిషేకాల అనంతరం రుద్ర హోమం, నవగ్రహ హోమాలు నిర్వహిస్తారు.

ఘనంగా హనుమద్వ్రతం

మండపేట: స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో కొలువైన భక్తాంజనేయ స్వామి వారి శుక్రవారం హనుమద్వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఆలయంలో పంచామృతాభిషేకం, తమలపాకులు, గంధ సింధూర నామార్చన, వివిధ రకాల పుష్పాలతో విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి పవన్ కుమార్ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే పూజలు మొదలయ్యాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గెడా రాము, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం హనుమద్వ్రతం నిర్వహించారు. కోరుమిల్లి, చినకోరుమిల్లి గ్రామాల హనుమంతుని భారీ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంగర, నల్లూరు, కపిలేశ్వరపురం, తాతపూడి తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి విగ్రహాలు, ఆలయాల్లో అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భజనపాళీ బృందం సభ్యులు స్వామిని కీర్తిస్తూ గీతాలు ఆలపించారు.



మండపేటలో పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి

హనుమాన్ చాలీసా పారాయణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరంలో వేంచేసిన అష్టలక్ష్మీ ఆలయంలో శుక్రవారం రామచంద్రపురం పట్టణానికి చెందిన ఏలూరు వెంకన్నబాబు ఆధ్వర్యంలో హనుమద్వ్రతం సందర్భంగా 41 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



అంగరలో విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

కె.గంగవరంలో..

కె.గంగవరం: మండల కేంద్రం కె.గంగవరం బస్టాండ్ సెంటర్ వద్ద భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో హనుమజ్జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలిరోజు వేద పండితుల బ్రహ్మత్వంలో ఉదయం నుంచీ లక్ష తులసిపూజ, సిందూర పూజ, తమలపత్ర పూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద 6 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి చివరిరోజు భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోటిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి సందర్భంగా వేదపండితులు పెద్దింటి లక్ష్మణచార్యులు, వై.వీరభద్రరావు, రమణల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామస్తులు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోటిపల్లిలో హనుమద్వ్రతం సందర్భంగా నిర్వహిస్తున్న హోమాలు

వైద్య శిబిరాలెక్కడ!

- గతంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిర్వహణ
- ఐదు నెలలుగా కానరాని శిబిరాలు
- పేదలకు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి

కె.గంగవరం: ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం ఆ పరిస్థితి కానరావడం లేదు. ఒకప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష పేరు మీద గ్రామీణ ప్రాంతాల్లో నెలకు ఒకసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం అధికార పార్టీ అధికారంలోని వచ్చిన తరువాత కనీసం ఏ గ్రామంలో కూడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ వైద్యం అందకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారు. గత ఐదు నెలల నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయలేదు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఈ ఆరోగ్యశ్రీ నిర్వహణకు సుమారుగా 110 మంది పీహెచ్‌సీ మిత్రలను ఏర్పాటు చేశారు. వీరి ప్రతి మండలంలోని నెలకు ఒకసారి పేరొందిన వైద్యులు, పలు ఆసుపత్రుల సిబ్బందితో గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. రోగులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేసి ఆపరేషన్ అవసరమైన వారికి గుర్తించి వారికి ఆపరేషన్ చేయించేవారు. అంతేకాకుండా ఆపరేషన్ చేయించినప్పటి నుంచి రోగం నయం అయ్యేవరకు పీహెచ్‌సీ మిత్రలు వారి బాగోగుల చూసుకునేవారు. అప్పటి వరకు సజావుగా సాగిన ఈ పథకం ఒక్కసారిగా తారుమారైపోయింది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలైతే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వైద్యశాఖ అధికారులు స్పందించి వెంటనే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న ప్రజలు

గతంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పలు రకాల పరీక్షలు చేయించుకుని మందులు తీసుకువెళ్లేవారు. కానీ ఇప్పుడు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. రెక్కాడితేనే గాని డొక్కాడని తాము సొమ్ములు వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించలేమని గ్రామీణ ప్రాంత పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శివలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



గ్రామీ ప్రాంతాల్లో గతంలో ఏర్పాటు చేసిన విధంగానే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. గత ఐదు నెలలుగా మండలంలో ఏ గ్రామం లోనూ శిబిరం నిర్వహించ లేదు. ఏ చిన్న సమస్య వచ్చిన పట్టణానికి వెళ్లాల్సి వస్తుంది.

– రాంబాబు, యర్రపోతవరం

సొమ్ము ఖర్చయిపోతోంది



పనిలోని వెళితే గాని పొట్టగడవని పేదోళ్లం. రోగం వస్తే దాచుకున్న సొమ్ములు మొత్తం ఖర్చవుతున్నాయి. ఏ చిన్న రోగం వచ్చిన ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నాం. గతంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే కావాల్సిన మందులు ఉచితంగా ఇచ్చేవారు.

– రాయుడు జగన్, పేకేరు

ఆలమూరు మండల అధికారులు

హోదా	ఫోన్ నంబరు
తహసీల్దార్	98499 03902
రావులపాలెం రూరల్ సీఐ	94407 96537
సబ్ ఇన్‌స్పెక్టర్	94409 04849
ఇన్‌చార్జి ఎంపీడీఓ	83175 42815
వెటర్నరీ ఏడీ	95503 93727
ఈఓపీఆర్‌డీ	83175 42815
ఏడీఏ	83310 56664
మండల వ్యవసాయాధికారి	83310 56557
ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్	97012 87828
ఎన్‌ఆర్‌జీఈఎస్ ఏపీఓ	70933 23644
వెలుగు ఏపీఎం	98499 01696
హౌసింగ్ జేఈ	70939 30448
ఎంఈఓ-1	80748 05733
ఎంఈఓ-2	96189 37973
ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	91001 21135
సీడీపీఓ, కొత్తపేట	94408 14683
చొప్పెల్ల పీహెచ్‌సీ	70136 40523
పెదపళ్ల పీహెచ్‌సీ	88017 87816
ఇరిగేషన్ జేఈ	83286 29109
పశువైద్యాధికారి	95332 87404
ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	91609 88844
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	63099 39852
ఐసీడీఎస్ సూపర్‌వైజర్	89778 30575
ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి	93467 87187
మండల ఇంజినీరింగ్ జేఈ	83175 43987
ఆర్‌అండ్‌బీ జేఈ (మండపేట)	94408 18537
ఉద్యాన శాఖాధికారి	87126 25210
కార్మిక శాఖాధికారి	94925 55059
అటవీ శాఖాధికారి	98493 52664
ఆర్టీసీ డిపో (ఆర్‌సీపురం)	73828 25536
ఆర్టీసీ డిపో (రావులపాలెం)	99592 25537
ట్రాన్స్‌కో ఏఈ (ఏపీఈపీడీఎల్)	94408 12601
డ్రైన్స్ ఏఈ	88860 66939

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629